క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



కొత్తకోట: శివ మాలధారులు మండల దీక్ష కాలంలో ఇబ్బందులు పడకుండా దాతల సహకారంతో పట్టణంలో నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా పట్టణానికి చెందిన వెంకటాచారి రూ.11,116లు, అదేవిధంగా బీసం రాజవర్ధన్‌రెడ్డి, బ్రహ్మ రూ.5,116లను విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసచారి, గురుస్వాములు శాంతిరెడ్డి, శ్రీనివాస్, మేకల రాజు, రవికుమార్, నాగరాజు ఉన్నారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



కొత్తకోట: ఎంపీ డీకే అరుణ తన నిధుల నుంచి కేటాయించిన రూ.15 లక్షల నిధులతో మున్సిపాలిటీలోని 11వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. పట్టణ బీజేపీ మాజీ కౌన్సిలర్ భరత్‌భూషణ్ భూమిపూజ చేశా. సీసీ నిర్మాణ పనులకు నిధులు కావాలని అడిగిన వెంటనే మంజూరు చేసిన ఎంపీ డీకే అరుణకు భరత్‌భూషణ్, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి




ఆత్మకూర్: అప్పుల కుప్పగా మారిన తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం నారాయణపేటలో జరిగిన సీఎం బహిరంగ సభకు ఆత్మకూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ. 7లక్షలు కోట్లు అప్పులతో చేసిన అభివృద్ధిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 14 నెలల్లో చేసి చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్‌యాదవ్, శ్రీను, నాగేష్, దామోదర్, మహేష్, గణేష్, వెంకటేష్, బుచ్చన్న, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

946 మందికి మధుమేహ పరీక్షలు



పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దావాజిపల్లి, శాగాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న మధుమేహ పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. 30 ఏళ్లు దాటిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 946 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రేవతి, సుమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఆమరణ నిరాహార దీక్ష చేపడతాం’



కొత్తకోట: మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు బీజేపీ మాజీ కౌన్సిలర్ భరత్‌భూషణ్ స్పష్టం చేశారు. కొత్తకోట మున్సిపాలిటీకి గతేడాది అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరై టెండర్లు పూర్తయిన పనులు తక్షణమే చేపట్టాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం కావడంతో నిరాహార దీక్షకు పూనుకున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్టార్ బాలు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, అత్యుత్తమ ఫలితాలు సాధించి తాము చదివిన పాఠశాలలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై సూచనలు చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం తరఫున విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గణితంపై విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సరైన విధంగా గణిత సమస్యలను పరిష్కరించిన విద్యార్థులకు చాక్లెట్లు అందజేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణానికి సంబంధించి ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న పెండింగ్ పనులు పూర్తి చేయడానికి అంచనాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

భవిత కేంద్రం సందర్శన

భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. స్థానిక కేడీఆర్‌నగర్‌లోని మండల విద్యాధికారి కార్యాలయంలో భవిత (ప్రత్యేక అవసరాల బాల బాలికల జిల్లా వనరుల కేంద్రం) కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. భవిత సెంటర్ ఉన్న చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి కావాల్సిన వసతులు సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. వారి నైపుణ్యాలను తీర్చిదిద్ది స్పెషల్ స్కూల్ నుంచి నార్మల్ స్కూల్‌కు పంపడానికి అన్నిరకాలుగా అవసరమైన విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ఫిజియోథెరపీకి సంబంధించి వైద్య శాఖ నుంచి థెరపిస్టును పిలిపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు యుగంధర్, శేఖర్, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, భవిత కేంద్రం సిబ్బంది ఉన్నారు.

‘విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం’

సాక్షి ఎఫెక్ట్..



విద్యార్థులతో మాట్లాడుతున్న వార్డెన్ సంతోష్

గోపాల్‌పేట: మండలంలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎస్సీ, బీసీ సాంఘీక సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు తెలిపారు. శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన ‘వసతి గృహాలపై పట్టింపేదీ’ అనే కథనంపై మండల కేంద్రంలో ఉన్న ఆయా వసతి గృహాల వార్డెన్లు స్పందించారు. శుక్రవారం సాయంత్రం వారు మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్, బీసీ హాస్టళ్లల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎటువంటి సమస్యలు ఉన్నా తమతో పంచుకోవాలని సూచించారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత రోడ్లపై తిరగకూడదని, ఎవరైనా సీనియర్ విద్యార్థులు తిట్టినా, లేదంటే ఆహారం బాగాలేకున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్టీ హాస్టల్ వార్డెన్ సంతోష్‌కుమార్ కొత్తకోటలో పోస్టింగ్.. గోపాల్‌పేటలో ఇన్‌చార్జ్ ఇచ్చారని, బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్‌గౌడ్ గోపాల్‌పేటలో పోస్టింగ్.. పెద్దమందడి ఇన్‌చార్జ్ వార్డెన్‌గా పనిచేస్తుండడంతో.. సమయాభావం కారణంగా ఉదయం ఒక హాస్టల్‌లో, సాయంత్రం మరో హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని భరోసా కల్పించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



రాయినిపల్లిలో డ్రోన్ ద్వారా మందుల పిచికారీని పరిశీలిస్తున్న ఏఓ రాజవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: వ్యవసాయ అధికారుల సూచనల మేరకే రైతులు మందులను పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయినిపల్లి, మాందాపూర్ గ్రామాల్లో వరి పంటలకు ఆశించిన తెగుళ్లను పరిశీలించారు. వాటి నియంత్రణకు రైతులు వాడాల్సిన మందుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ యాంత్రీకరణ వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలకు ఎక్కువగా అగ్గి తెగులు ఆశిస్తుందని వాటి నివారణకు వాడాల్సిన మందులను రైతులకు సూచించారు. డ్రోన్ ద్వారా మందుల పిచికారీని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

వరి పంటకు కాండం కుళ్లు తెగులు

అమరచింత: మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పంటకు కాండం కుళ్లు తెగులు సోకిందని, అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి అరవింద్ కోరారు. మండలంలోని నందిమళ్లలో శుక్రవారం చంద్రశేఖర్‌రెడ్డి అనే రైతు సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ జింక్, నత్రజని, పోషక లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటి వలన పంట పెరగకుండా చివరి ఆకులు ఎండిపోయి, ఆకుల మీద నల్లటి శిలీంద్రాలు ఉండి కాండం కింది భాగంలో వేర్లు కుళ్లి చనిపోతుందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారు సూచించిన మందులనే వాడాలని సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న గోవర్ధన్‌సాగర్

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ, బాలపీర్ల దర్గా సమీపంలో స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్మించే మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి శుక్రవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి, ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం రూ.3 లక్షలతో, మండల కేంద్రం సమీపంలోని బాలపీర్ల దర్గాకు వచ్చే భక్తులకు అనుకూలంగా ఉండేలా రూ.5 లక్షల నిధులతో మరుగుదొడ్లు, మూత్రశాలలను ఎస్‌బీఎం ద్వారా నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రిలోచికిత్స పొందుతున్న కార్మికురాలిని పరామర్శిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ మహిళా కార్మికులపై ప్రిన్సిపాల్ అనుచిత వైఖరిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, పట్టణ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం విధుల్లోకి వచ్చిన అయిదుగురు కార్మికులను లోపలికి రానీయకుండా కళాశాల గేటు వద్ద ఎండలో నిలబెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిలో సుజాత అనే కార్మికురాలు స్పృహ తప్పి పడిపోగా.. వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కార్మికురాలిని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న అయిదుగురు ఔట్‌సోర్సింగ్ మహిళా కార్మికులు పనిచేయడం లేదని వారిని ప్రిన్సిపాల్ విధుల్లోకి రానివ్వలేదన్నారు. శుక్రవారం కూడా వారు కళాశాల గేటు వద్దే నిలబడి వేచి చూశారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. లేదంటే ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పరీక్ష ప్యాడ్ల వితరణ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్యాడ్లను వితరణగా అందజేశారు. క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు తల్లి కీర్తిశేషులు రామచంద్రమ్మ కల్వరాల పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్యాడ్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాజవర్ధనాచారి, వరప్రసాద్, సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు కళావతమ్మ, జితేందర్, మధుసూధన్, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి సైన్స్ వారోత్సవాలు

పాన్‌గల్: ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22వ తేదీ నుంచి సైన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైస్కూల్ విభాగంలో ‘మా ప్రయోగశాల – పరికరాల పరిచయం’ ఈ పోటీలో పాల్గొనే విద్యార్థులు పాఠశాలలోని ప్రయోగశాలలో ఉన్న పరికరాలను (టెస్టు ట్యూబ్‌తో మొదలు పెట్టుకొని ఏదైనా సరే) పరిచయం చేస్తూ వివరించాలని, పాఠశాల నుంచి ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాలని సూచించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస పోటీ ‘డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం–స్ఫూర్తి’ విద్యార్థులు నల్లబల్లపై వివరాలు రాసి ఇచ్చిన అంశంపై ఉపన్యసిస్తూ దాన్ని వీడియో రికార్డు చేసి పంపించాలి. ఆయా అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సైన్స్ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పాన్‌గల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. హెచ్‌సీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టాపూర్‌తండాకు చెందిన బద్దెలి (79) ఈనెల 5వ తేదీన కుమారుడి బైక్‌పై పాన్‌గల్ ఈదమ్మ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ్తూ కళ్లు తిరిగి సీసీ రోడ్డుపై కిందపడటంతో తల వెనుక భాగంలో బలమైన గాయం తగిలింది. వెంటనే జిల్లా ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుమారుడు బాబునాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.

పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మాణం వద్దు

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ద్వారా నిర్మించే నూతన వాటర్ ట్యాంకు స్థలంను కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి నిర్మించే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును హైస్కూల్ ఆవరణలో నిర్మించడం ద్వార విద్యార్థులకు ఆట స్థలం కరువవుతుందన్నారు. ఇతర ప్రభుత్వ స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మించాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, కుతుబ్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

కొల్లాపూర్: మండలంలోని రైతుల అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నార్లాపూర్, రామ్‌నాయక్‌తండా, లచ్చునాయక్ తండా, ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు పరిశీలించారు. సాగు విధానాల గూర్చి రైతులతో మాట్లాడారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కొల్లాపూర్ సింగిల్‌విండో కార్యాలయంలో 694 బస్తాలు, మాచినేనిపల్లి సింగిల్‌విండో కార్యాలయంలో 1,261 బస్తాలు, కొల్లాపూర్ ఆగ్రోస్‌లో 819 బస్తాలు, ప్రైవేటు డీలర్ల వద్ద 1,666 బస్తాల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు.

సోర్ట్స్ యూనివర్సిటీకి సీఎం అనుకూలం



విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- ముగిసిన కేపీఎల్ క్రికెట్ పోటీలు

కొత్తకోట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నట్లు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కొత్తకోటలో వారం రోజులుగా కొనసాగిన కేపీఎల్ క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతగా నిలిచిన శివ డిజిటల్స్ జట్టుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి రూ.లక్ష, రెండో విజేత ఆర్ఆర్ఆర్ జట్టుకు రాహుల్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ఇల్లూరి హరిన్‌రెడ్డి రూ.50 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. పట్టణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. దీంతో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటును సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.382 కోట్లు కేటాయించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ఇల్లూరి హరిన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పి.ప్రశాంత్, ఆరోగ్య వాకింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు పి.శేఖర్‌గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే బాబు, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లి, అనిరుద్‌రెడ్డి, కేపీఎల్ నిర్వాహకులు నవీన్‌రెడ్డి, గుంత శివ, రఘు, బాలకృష్ణారెడ్డి, సాయి, సన్నీ, అరుణ్, మహేష్, తరుణ్, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుకలు



దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పాతబజార్ వీరాంజనేయస్వామి ఆలయ పున:ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు శుక్రవారం ప్రముఖ వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ నేతృత్వంలో ప్రారంభమయ్యాయి. 400 ఏళ్ల క్రితం సంస్థానాధీశుల కంటే పూర్వం నాటి వీరాంజనేయ ఆలయం వనపర్తిలో చేపట్టిన రోడ్ల విస్తరణలో తొలగించడంతో పున: ప్రతిష్ఠ మహోత్సం ఆగమశాస్త్ర ప్రకారం వేదపండితులు చేపడుతున్నారు. తొలిరోజు గణపతి పూజ, హోమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య చేపట్టి రక్షాబంధనంతో అఖండ దీపస్థాపనకు అంకురార్పణ చేశారు. పంచద్రవ్య మేళనంతో నూతన ఆలయాన్ని ప్రోక్షణం చేసి, దీక్షాధారణ, సర్వతోభద్ర మండలం, యోగిని మండలం, వాస్తు మండలం, క్షేత్రపాలన పూజ, నవగ్రహ మండల దేవతా ఆవాహనం కృతులను పండితులు జరిపించారు.

మాజీ మంత్రి దంపతుల పూజలు

యాగశాల సంస్కార అంకురార్పణలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, వాసంతి దంపతులు పాల్గొని, పూజాధికాలు నిర్వహిటించిన అనంతనం మూల మంత్ర జపం, అగ్నిప్రతిష్ఠతో పాటుగా సాయంత్రం జలాధివాసం, మంగళహారతి పూజలు భక్తులను కనువిందు చేశాయి. అంతకుముందు రాంనగర్‌లోని అభయాంజనేయ ఆలయంలో కొలువుదీరిన వీరాంజనేయ మూర్తి, శివలింగానికి, నవగ్రహాలకు, నాగదేవతామూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు చేపట్టి ఉద్వాసనన పలకడంతో పున:నిర్మించిన ఆలయానికి వీరాంజనేయ స్వామితో పాటుగా మిగతా దేవతామూర్తును మేళతాళాలతో, భజాభజంత్రీలతో రహదారిని జలాలతో శుద్ధి చేస్తూ ఊరేగింపు చేశారు. మరో రెండు రోజుల పాటు ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించనున్నట్లు జోషి ప్రశాంత్‌శర్మ వెల్లడించారు. కార్యక్రమంలో వేదపండితులు ధీరజ్‌శర్మ, గణేష్‌శర్మ, శాంతికుమార్‌శర్మ, నరేందర్‌శర్మ, ఆలయ కమిటీ, భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్షయతో అప్రమత్తంగా ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తకోట రూరల్: టీబీ లేని జీవితాన్ని జీవించాలని, ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడితే తగ్గిపోతుందని పెద్దమందడి పీహెచ్‌సీ డాక్టర్ యశస్విని అన్నారు. క్షయవ్యాధి గుర్తింపు శిబిరంలో భాగంగా శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రంలో 135మందికి, చిన్నమందడిలో 108మందికి ఎక్స్‌రేలు తీసినట్లు డాక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, తరచూ జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని పీహెచ్‌సీలో నమూనాలు ఇచ్చినట్లయితే వ్యాధిని గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కర్, సూపర్‌వైజర్ ఓంప్రకాష్, వైద్య సిబ్బంది లక్ష్మణ్, శిరీష, ఆశా వర్కర్స్ లక్ష్మి, మన్నెమ్మ తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ కూలీలను పెంచాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టే జాతీయ ఉపాధిహామీ పథకం పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఆగారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. లేవలింగ్ పనులు, కూలీల హాజరుకు సంబంధించిన మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కూలీల సంఖ్య పెరిగినప్పుడే పనులు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్ మంజులకు సూచించా. అదేవిధంగా నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం



చిట్యాలలో తెలుగు ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం



యాపర్లలో..

సాక్షి, నెట్‌వర్క్: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

- తెలంగాణ మోడల్ స్కూల్, పెబ్బేర్‌లో మాతృభాష గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్‌కుమార్, అధ్యాపకులు అంజనీదేవి, మంగమ్మ, హేమలత తదితరులు ఉన్నారు.
- వనపర్తి మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండితుడు బూరోజు గిరిరాజాచారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కొమ్ము చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేష్, చెలిమి సంస్థ జిల్లా అధ్యక్షుడు రవి, చెలిమి కోఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పెబ్బేరు మండలంలోని యాపర్ల ఉన్నత పాఠశాలలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు సేవలందిస్తున్న సాహితీవేత్తలు కందూరు నారాయణరెడ్డి, సందాపురం బుచ్చయ్య, భాషోపాధ్యాయులు శ్రీధర్, ఇందిర కు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, బాలమ్మ, ఆంజనేయులు, శివాని, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ పాఠశాలలు.. ప్రతిభకు నిలయాలు’



విద్యార్థులతో ఎస్‌ఓ చందన

కొత్తకోట రూరల్: విద్యార్థుల సంపూర్ణ వికాసంతో పాటు ప్రతిభకు నిలయాలుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తాయని అమడబాకుల కేజీబీవీ ఎస్‌ఓ చందన అన్నారు. శుక్రవారం కేజీబీవీలో వార్షికోత్సవ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు, సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కరాటేలో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచిన గౌనికాడి జయలక్ష్మిని అభినందించారు. ఎస్‌ఓ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడి లేకుండా సంపూర్ణ స్వేచ్ఛతో విద్యాభ్యాసం చేసేందుకు కస్తూర్బా పాఠశాలలు నిలయాలుగా నిలుస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు ధీటుగా రాణిస్తున్నాయని తెలిపారు.